పత్రికా ప్రకటన - 4

# ముఖ్యమంత్రి కార్యాలయము

# తెలంగాణ ప్రభుత్వం

తేదిః 6.08.2014

తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి గ్రామానికి సురక్షిత మంచినీరు అందుబాటులో వుండే విధంగా ప్రతి ఇంట్లో నల్లా తిప్పగానే నీరు వచ్చే విధంగా తాగునీటి వ్యవస్థను తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు ప్రకటించారు.

డ్రింకింగ్ వాటర్ గ్రిడ్ ఆఫ్ తెలంగాణ పథకంపై సచివాలయంలో బుధవారం ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. పంచాయతీరాజ్ శాఖ మంత్రి కె.తారకరామారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాజీవ్ శర్మ, సిఎంఒ ముఖ్యకార్యదర్శి ఎస్.నర్సింగ్ రావు, పంచాయతీరాజ్ కార్యదర్శి రేమాండ్ పీటర్ తదితరులు సమీక్షలో పాల్గొన్నారు.

ఇప్పటికే మంచినీటి సరఫరా పేరిట వేల కోట్ల రూపాయలు ఖర్చు జరిగినా అన్ని ప్రాంతాలకు నీరు అందటం లేదని ముఖ్యమంత్రి చెప్పారు. తెలంగాణలో వున్న ఆవాస ప్రాంతాలన్నింటిని గూగుల్ మ్యాప్ ద్వారా గుర్తించాలని, మండలాల వారిగా కాంటూర్లను గుర్తించాలని, వీటిని అనుసరించి వాటర్ గ్రిడ్ పనిచేసేలా చూడాలన్నారు. ఇందుకోసం తెలంగాణ వ్యాప్తంగా సమగ్ర సర్వే చేయాలని అధికారులను కోరారు. ప్రజలకు సురక్షిత మంచినీరు అందించడం ప్రభుత్వ కనీస బాధ్యత అని కేసిఆర్ చెప్పారు. ప్రస్తుతం తెలంగాణలో మంచినీటి సరఫరాకు వున్న పైపులైన్లు, రిజర్వాయర్లు, వాటర్ సోర్స్ తదితర అంశాలపై పూర్తి నివేదిక సమర్పించాలని కోరారు. ఇప్పుడున్న దానికన్న ఎంత అదనపు పైపులైను అవసరం పడుతుంది, గ్రావిటి ద్వారా ఎక్కడ నుండి ఎక్కడి వరకు నీరు అందించవచ్చు, ఎక్కడ లిఫ్టుల అవసరం వుంటుంది, ఎంత నీరు ఇంకా అవసరం పడుతుంది, ఈ గ్రిడ్ నిర్వహణకు ఎంత విద్యుత్ కావాలి అనే అంశాలపై కూలంకషమైన పరిశీలన అవసరమని చెప్పారు. తెలంగాణలోని వరంగల్, మహబూబ్‌నగర్ జిల్లాలు మినహా అన్ని జిల్లాలోనూ ఇప్పటికే ఈ పథకాన్ని అమలు చేయడానికి అనుకూలమైన పరిస్థితి వుందన్నారు. జిల్లాల్లో వుండే స్థానిక నీటి వనరులను గుర్తించాలని, జిల్లాల వారిగా సాగునీటి ప్రాజెక్టుల ద్వారా ఎక్కడి వరకు నీటి సరఫరా అవుతుందో చూడాలని చెప్పారు. సాగునీటి కాలువల ద్వారానే గ్రామాలకు మంచినీరు కూడా సరఫరా చేసే విధంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. ఎత్తైన ప్రాంతాలకు నీటిని తరలించి అక్కడి నుండి గ్రావిటీ ద్వారా కింది

ప్రాంతాలకు నీరందిస్తే ఖర్చు తక్కువ అవుతుందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. ఎల్‌ఎండి నుండి సిద్దిపేటకు నీరు తరలించి అన్ని గ్రామాలకు నీరందిస్తున్నామో రాష్ట్రమంతా అదే విధానాన్ని అనుసరించాలని సూచించారు. సిద్దిపేట నియోజకవర్గ తాగునీటి సరఫరా వ్యవస్థను కూడా ఈ సమావేశంలో ముఖ్యమంత్రి వివరించారు. సాగునీటి ప్రాజెక్టులలో పది శాతం నీటిని మంచినీటికి వాడాలని నిర్ణయం తీసుకున్నందున దీనిని మంచినీటి సరఫరా వ్యవస్థను మెరుగుపరచేందుకు వినియోగించుకోవాలని సూచించారు. ప్రాజెక్టులలో మంచినీటి సరఫరాకు అవసరమయ్యే నీటిని సాగునీటికి అందించకుండా ముందుగానే లెవెల్స్ పెట్టుకుంటామని వెల్లడించారు. కృష్ణా, గోదావరి నదులపై వున్న ప్రాజెక్టులు, వివిధ జిల్లాల్లో వున్న రిజార్వాయర్లు, మున్నేరు లాంటి నదులు, పాకాల, రామప్ప లాంటి చెరువులు, స్థానికంగా వున్న ఇతర నీటి వనరులను ఒకదానికొకటి అనుసంధానం చేయాలని సూచించారు. గ్రామాలలో, పట్టణ ప్రాంతాలలో ఇప్పటికే చాలా వరకు పైపులైన్లు వేశారని, అవసరమైన మేరకు వాటిని పొడిగించాలని, ఈ పైపు లైన్లకు నీరు ఎక్కడి నుండి ఎలా సరఫరా చేయాలన్నదే ఆలోచించాల్సి వుందన్నారు. ఈ దిశగా అధికారులు సర్వే నిర్వహించాలని సూచించారు.

---

**సిపిఆర్ఓ టు సిఎం**